ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్

● ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ● కేటీఆర్ సభకు సంబంధించిన కరపత్రాలు విడుదల

కరపత్రాలు విడుదల చేస్తున్న ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఎదులాపురం, అక్టోబర్ 19: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నదని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని భాగ్యనగర్ చాందా(టీ), బెల్లూరి, హ్యాండి క్యాప్ కాలనీ, ప్రణతి, విద్యానగర్ కాలనీల్లో బీఆర్ఎస్ నాయకులను కలిశారు. ఈ నెల 24వ తేదీన నిర్వహించే కేటీఆర్ సభను విజయవంతం చేసే దిశగా వారితో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. కేటీఆర్ సభలో పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొనేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలల్లో ప్రజలను తీవ్ర అసంతృప్తికి గురి చేసిందన్నారు. సంక్షేమ పథకాలు అందించకుండా కేవలం మూసీ నదిపై దృష్టి సారించడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కాసుల కోసం కాకుండా ప్రజా సంక్షేమం కోసం ఆలోచించాలని లేనిచో ప్రజల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్ స్వామి, పందిరి భూమన్న, పండ్ల శ్రీనివాస్, దమ్మపాల్, కోవ రవి, సాయి పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ మండల స్థాయి సమావేశం

బేల, అక్టోబర్ 19 : బేలలోని గణేశ్ గార్డెన్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే బీఆర్ఎస్ మండల స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీమంత్రి జోగు రామన్న హాజరవుతున్నందున మండలంలోని బీఆర్ఎస్ గ్రామ కమిటీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ గ్రామ అనుబంధ సంఘాల సభ్యులు సకాలంలో పాల్గొనాలని కోరారు.

బతుకమ్మ సంబురాలను విజయవంతం చేయాలి

బేల, అక్టోబర్ 19 : బేలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న బతుకమ్మ సంబురాలను విజయవంతం చేయాలని బజరంగ్‌దళ్ మండలాధ్యక్షుడు ఆకాశ్ అగర్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మహిళలు, యువతులు తమ బతుకమ్మలతో హాజరుకావాలని కోరారు.

విరాళం

ఇచ్చోడ, అక్టోబర్ 19 : నర్సాపూర్ గ్రామంలో బతుకమ్మ నిర్వహించిన మహిళలకు శ్రీనివాస్ నాయక్ ఫౌండేషన్ అధినేత శ్రీనివాస్ నాయక్ శనివారం రూ.5 వేలు విరాళం అందజేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

25న కుమ్రం సూరు వర్ధంతి

ఉట్నూర్, అక్టోబర్ 19 : ఉట్నూర్ మండలం దంతన్‌పల్లిలో ఈ నెల 25వ తేదీన నిర్వహించే కుమ్రం సూరు వర్ధంతిని విజయవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సూరు వర్ధంతికి సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం

ఇచ్చోడ, అక్టోబర్ 19 : ఇచ్చోడలోని రంజాన్‌పుర కాలనీ చౌరస్తాలో జాఫర్ చెందిన దుకాణం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో దుకాణంలోని వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితుడు మాట్లాడుతూ రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

కార్మిక వర్గాన్ని గందరగోళానికి గురి చేయడం సరికాదు

ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 19 : ఇటీవల కొందరు ఐఎఫ్‌టీయూ పేరుతో సంస్థను ఏర్పాటు చేసుకుని అ సంస్థను టీయూసీఐ సంస్థలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారని దానికి మాతృసంస్థ ఐఎఫ్‌టీయూకు సంబంధం లేదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ అన్నారు. శనివారం ఖానాపూర్‌లోని విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు కావాలనే మాతృ సంస్థ అయిన ఐఎఫ్‌టీయూ తమ స్వలాభం కొరకు వాడుకుని కార్మికులను గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. ఐఎఫ్‌టీయూ కార్మిక వర్గ విముక్తికి, నూతన ప్రజాస్వామ్య రాజకీయ దృక్పథంతో జాతీయ స్థాయిలో ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో దుర్గం లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి తల్లిదండ్రుల పాత్ర కీలకం

జైనథ్, అక్టోబర్ 19 : మండలంలోని జామినిలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శరత్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇంట్లో ప్రశాంతమైన, వాతావరణాన్ని అందించాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ దేవుబాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★Req. Cashier, Female Waiter, South Indian Lunch & Tandoori Master, Housekeeping for Restaurant @ AS Rao Nagar. 9393123493, 7995900498.
NT-334839-All
WANTED PLOTS
★హైదరాబాద్, హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, పసుమాముల, అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, గ్రీన్‌సిటీ, మౌంట్ ఒపేరా, సింగరేణికాలనీలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-336725-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

అవగాహన కల్పిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బీ సౌజన్య

ఎదులాపురం, అక్టోబర్ 19 : చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే వాటి ద్వారా రక్షణ పొందగలుగుతామని.. ఈ దిశగా విద్యార్థినులు చట్టాల గురించి తెలుసుకోవాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి భోనగిరి సౌజన్య అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు వేధింపులకు గురైన సందర్భంలో నిర్భయంగా తమ ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. అలాగే సఖీ, వన్‌స్టాప్ కేంద్రాల ద్వారా, రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. బాలికల సంరక్షణకు రూపొందించిన చట్టాలు, అఘాయిత్యాలకు పాల్పడిన సందర్భంలో నేరస్తులకు వేసే శిక్షలు తెలియజేశారు. ఫోక్సో, జువైనల్ చట్టాలతో పాటు ర్యాగింగ్ యాక్ట్, బాలిక సంరక్షణ చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, న్యాయరక్షకులు గంగారాం, అశోక్, ఉమేర్రావ్, ప్యానల్ అడ్వకేట్ ఎం అశోక్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో మెరిసిన ఆదిలాబాద్ వాసి

ఎదులాపురం, అక్టోబర్ 19 : గుంటూరులో నిర్వహించిన 35వ సౌత్ జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా వాసి బంగారు పతకం సాధించారు. అండర్-14 బాలుర విభాగంలో ట్రయథాలిన్, లాంగ్ జంప్‌లో జాతర్ల గిరిజన క్రీడా పాఠశాలకు చెందిన రాథోడ్ కార్తీక్ మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. జాతీయ స్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకం సాధించిన కార్తీక్‌ను జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

డీఈఈకి సన్మానం

బోథ్, అక్టోబర్ 19: గిరిజన సంక్షేమ శాఖ డీఈఈగా బాధ్యతలు చేపట్టిన సతీశ్‌ను శనివారం గిరిజన లంబాడీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ సన్మానించారు. డీఈఈ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. డీఈఈతో పాటు ఏఈ శేఖర్‌ను సత్కరించారు. గిరిజన శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని వసతులు

బోథ్, అక్టోబర్ 19: ప్రభుత్వ వసతి గృహాల్లో నివాసముంటూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల వసతులతో పాటు ఏకరూప దుస్తులు అందిస్తుందని కౌఠ(బీ) జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శశిధర్ రెడ్డి అన్నారు. శనివారం విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ హాస్టల్ వార్డెన్ కృష్ణపల్లి శ్యాంసుందర్, తెలుగు పండిట్ కేదార్‌నాథ్, ఐకేపీ ఏపీఎం మాధవ్, సీసీలు , సిబ్బంది పాల్గొన్నారు.

ఖోఖో అండర్-14 ఎంపిక పోటీలు

తలమడుగు, అక్టోబర్ 19: కుచులాపూర్ గ్రామంలోని పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఖోఖో అండర్-14 బాలికల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన వీరు జోనల్ స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట్ రావ్, ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతారావ్, పీడీ రాంకుమార్, మండల మాజీ అధ్యక్షుడు రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

లక్ష్మణచాంద, అక్టోబర్ 19 : క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్- 14 ఖోఖో పోటీలను ప్రారంభించారు. బాలుర విభాగంలో లక్ష్మణచాంద ఉన్నత పాఠశాల నుంచి ఎస్ కే తన్వీర్, కరణ్, బాలికల విభాగంలో లక్ష్మణచాంద ఉన్నత పాఠశాల నుంచి కీర్తన, గంగోత్రి జోనల్ స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాజునాయక్ తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి అశోక్‌వర్మ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రవీందర్ గౌడ్, వివిధ పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మాజీ సర్పంచ్ సురకంటి ముత్యం రెడ్డి పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

క్యాన్సర్ బాధితులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైద్యులు

ఎదులాపురం, అక్టోబర్ 19 : క్యాన్సర్‌పై ప్రజలకు సైతం అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. హాస్పైస్ అండ్ పాలియేటివ్ కేర్ డేను పురస్కరించుకుని శనివారం ఆదిలాబాద్‌లోని రిమ్స్ పాలియేటివ్ కేర్ వార్డులో చికిత్స పొందుతున్న క్యాన్సర్ బాధితులకు రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌తో కలిసి పండ్లు పంపిణీ చేశారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో కృష్ణ మాట్లాడుతూ క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి అవసరమైన చికిత్సను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్‌వో సాధన, ఎన్‌సీడీ కార్యక్రమ అధికారి డాక్టర్ శ్రీధర్, ఎన్ఎస్ఎం ప్రోగ్రాం అధికారి డాక్టర్ వంశీకృష్ణ, పాలియేటివ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్, ఫిజియోథెరపిస్ట్ సునీత పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు భూమి పూజ

తలమడుగు, అక్టోబర్ 19: రుయ్యాడి గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సహకారంతో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు నాయకులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు నిట్యాడి గంగాధర్, రెడ్డి సంఘం అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, ప్రవీణ్, చిన గోక ప్రకాశ్ రెడ్డి, గోక విపుల్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కురిసిన భారీ వర్షం

ఇంద్రవెల్లి, అక్టోబర్ 19 : ఇంద్రవెల్లి మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో పత్తి పంటలకు మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలోని అంతర్గత రోడ్లతో పాటు విధుల్లో వర్షపు నీరు చేరింది.

తాటిగూడలో కుమ్రం భీం విగ్రహావిష్కరణ

ఉట్నూర్‌రూరల్: కుమ్రం భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్ రూరల్, అక్టోబర్ 19: ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన అమర వీరుడు కుంరం భీం విగ్రహాన్ని శనివారం తాటిగూడ గ్రామంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ఆవిష్కరించారు. భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు ఎమ్మెల్యే స్వగ్రామంలో కుమ్రం భీం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘన్‌పూర్ నుంచి శివనూర్ ఘాట్ రోడ్ పనులకు రూ.3.45లక్షలు మంజూరు అయ్యాయని అన్నారు. 8 కోట్లతో కల్లూర్ గూడకు, 5.36లక్షలతో చాప్రాల వరకు అభివృద్ధి పనుల నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో పీటీజి మెస్రం మనోహర్, ఏపీసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు, కుమ్రం భీం మనుమడు తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్, మర్సుకోల తిరుపతి, సిడాం గంగాధర్, పెందూర్ పుష్పారాణి, భాగ్యలక్ష్మి, బొంత ఆశారెడ్డి, నాయకులు, ఆదివాసీ నాయకులు, మహిళలు, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగపుత్రుల అభివృద్ధికి కృషి

ఉట్నూర్, అక్టోబర్ 19: గంగపుత్రులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శనివారం ఉట్నూర్‌లోని గోపయ్య చెరువులో చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో మత్స్యకారులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఒకే కుటుంబంలో ముగ్గురికి ఉద్యోగాలు

తలార్ల శ్రీకాంత్

తలార్ల లింగన్న

తలార్ల లింగమ్మ

తలమడుగు, అక్టోబర్ 19 : కజ్జర్ల గ్రామానికి చెందిన తలార్ల పోతన్న – గంగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. 2017 డీఎస్సీలో కుమారుడు శ్రీకాంత్ స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికై ప్రస్తుతం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. కుమార్తె లింగమ్మ 2018 గురుకుల ఫలితాల్లో పీజీటీ ఉద్యోగానికి ఎంపికై ప్రస్తుతం జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నది. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో మరో కుమారుడు లింగన్న ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. లింగన్న జంతుశాస్త్ర విభాగంలో పీజీని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఎడ్‌ని తెలంగాణ విశ్వ విద్యాలయంలో పూర్తి చేశాడు. చిన్నప్పటి నుంచి ముగ్గురు కూడా ఉపాధ్యాయులు కావాలన్న కోరికతో ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నారు. వీరిని గ్రామస్తులు, బంధువులు అభినందించారు.

కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

చెక్కులు పంపిణీ చేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, అక్టోబర్ 19 : భైంసాలోని నర్సింహా కల్యాణ మండపంలో శనివారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ 297 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, కౌన్సిలర్లు అమీర్, ఫయజుల్లా, గౌతంపింగ్లే, నాయకులు శ్రీనివాస్, గాలి రాజు, శ్రీనివాస్, అనిల్, రావుల పోశెట్టి పాల్గొన్నారు.

వెడ్మ రాము వర్ధంతిని విజయవంతం చేయండి

ఉట్నూర్, అక్టోబర్ 19 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం ఎదులాపాడ్ గ్రామంలో ఈ నెల 26వ తేదీన నిర్వహించే ఆదివాసీల అమరవీరుడు వెడ్మ రాము 37వ వర్ధంతిని జయప్రదం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పిలుపునిచ్చారు. శనివారం ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో నిర్వహణ కమిటీతో కలిసి పోస్టర్ విడుదల చేశారు. వర్ధంతి కార్యక్రమానికి ఆదివాసీలు పాల్గొని నివాళులర్పించాలన్నారు. కార్యక్రమంలో లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, ఆదివాసీ బిరుదుగోండ్ తోటి సేవా సంఘం సభ్యులు, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

భైంసా, అక్టోబర్ 19 : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో భైంసా మండలం ఇలేగాం గ్రామానికి చెందిన నవోదయ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు మానస్వి, మధుప్రియ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి ఈ నెల 24 నుంచి హిమచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఉప్పు రవీందర్ తెలిపారు. శనివారం విద్యార్థులను ఆర్డీవో కోమల్ రెడ్డి, ఏఎస్పీ అవినాశ్ కుమార్ అభినందించారు.. ఇక్కడ పోతన్న, సాయినాథ్, సుధాకర్, కోచ్ గంగాప్రసాద్ ఉన్నారు.

విలీన ప్రకటనతో ఐఎఫ్‌టీయూకి సంబంధం లేదు

ఎదులాపురం, అక్టోబర్ 18 : టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన ప్రకటనను మాతృ సంస్థ ఐఎఫ్‌టీయూకు ఎలాంటి సంబంధం లేదని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీ వెంకటనారాయణ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని కార్మిక లోకం గమనించాలని సూచించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలోని కుమ్రంభీం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఎఫ్‌టీయూ శ్రేణులు మరింత ఐక్యంగా దృఢంగా సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గౌరాల సుభాష్, గంగమ్మ, శ్యామ్, సునీత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

దస్తురాబాద్, అక్టోబర్ 19 : పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించిన పోషకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లల బాధ్యత, భవిష్యత్‌పై ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి రోజూ పిల్లలను పాఠశాలలకు పంపాలని కోరారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఉపాధ్యాయులు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు కోట వేణు, ఉపాధ్యాయులు, సీఆర్పీ తిరుపతి, ఐఆర్పీ జగన్ పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణ కోసమే ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం

దస్తురాబాద్, అక్టోబర్ 19 : రాజ్యాంగపరంగా సంక్రమించిన హక్కుల పరిరక్షణ కోసమే ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భవించిందని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజేశ్ నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో ఆ సంఘం నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వెంకట్రాజం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందూ దేవాలయాలపై దాడులను అరికట్టాలి

భైంసా, అక్టోబర్ 19: హిందూ దేవాలయాలు, విగ్రహాలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్, హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం భైంసాలో వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి భారీ ర్యాలీ తీసి ఏఎస్పీ అవినాశ్ కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు వెంకటేశ్ గుజ్జల్‌వార్, కాశీనాథ్, సురేశ్, రంగు శ్రీనివాస్, మారుతి, మల్లేశ్, పోశెట్టి, నవీన్ పాల్గొన్నారు.

బోథ్‌లో 2966 క్వింటాళ్ల సోయా కొనుగోళ్లు

బోథ్, అక్టోబర్ 19 : మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్, సహకార సంఘాల ఆధ్వర్యంలో శనివారం వరకు 2,966 క్వింటాళ్ల సోయాబీన్ కొనుగోలు చేసినట్లు కేంద్రం ఇన్‌చార్జి గోలి స్వామి తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన 185 మంది రైతులకు చెందిన 5,932 బస్తాల సోయా కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.4892 చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కుమ్రం భీం వర్ధంతి

నేరడిగొండలో ర్యాలీ తీస్తున్న ఆదివాసీ నాయకులు

నేరడిగొండ, అక్టోబర్ 19 : నేరడిగొండలోని ఆదివాసీ భవన్ వద్ద శనివారం కుమ్రం భీం వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆదివాసీ నాయకులు ప్రధాన వీధుల గుండా ర్యాలీ తీశారు. కార్యక్రమంలో రాయిసెంటర్ సార్‌మేడి ఆత్రం గంగారాం, ఉప సార్‌మేడి పెరుమాండ్ల గంగాధర్, తుడుందెబ్బ మండలాధ్యక్షుడు జుగ్నాక్ సాంబన్న, గ్రామాల పటేళ్లు, దేవరిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మంచినీటి సహాయకులకు సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లు అందుకున్న గ్రామ మంచినీటి సహాయకులు

తాంసి, అక్టోబర్ 19 : మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకులు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఇంటింటికీ వచ్చే నల్ల, పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు, నల్ల లీకేజీ, త్రీఫేస్, సింగిల్ ఫేస్ మోటర్, ప్యానెల్ బోర్డు రిపేర్, హ్యాండ్ పంపు, బోర్‌వెల్‌పై శిక్షణ అందించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నీటి నాణ్యత నిపుణులు తిరుపతి, చంద్రశేఖర్, మిషన్ భగీరథ ఈఈ చంద్రమోహన్, స్పెషల్ ఆఫీసర్ వెంకట రమణ, ఎంపీడీవో మోహన్ రెడ్డి, ఎంపీఈవో లింగయ్య, మిషన్ భగీరథ ఏఈఈ ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు రైతు భరోసాపై నిరసన

ఖానాపూర్, అక్టోబర్ 19 : నియోజకవర్గంలోని ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్, జన్నారం మండల కేంద్రాల్లో ఆదివారం నిర్వహించే రైతు భరోసా నిరసన కార్యక్రమాన్ని బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు విజయవంతం చేయాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ డైరెక్టర్ ప్రదీప్ కోరారు. శనివారం బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎకరాకు రూ.15 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

తానూర్/కుబీర్, 19 : కుబీర్‌లో తోటంబా తండా వరకు రూ.4కోట్ల50లక్షలతో చేపడుతున్న రోడ్డు నిర్మాణానికి ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ భూమి పూజ చేశారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో మండంలోని పలు గ్రామాలకు చెందిన 120 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సోము, బీజేపీ మండలాధ్యక్షుడు దత్తాత్రి, మాజీ మండలాధ్యక్షుడు విఠల్, ఎంపీడీవో నవనీత్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థినులు ఎంపిక

ముథోల్, అక్టోబర్ 19 : ముథోల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన జ్యోత్స్న, గంగోత్రి రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ సెలక్షన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ప్రధానోపాధ్యాయులు, పీడీ శ్రీనివాస్ ఆకాంక్షించారు.

బుద్ధ విహార్‌కు భూమిని కేటాయించాలి

ముథోల్, అక్టోబర్ 19 : బోరిగాం గ్రామంలోని బుద్ధ విహార్ లంబిని వనంకు సర్వే నంబర్ 249 విస్తీర్ణంలో ఉన్న ఒక ఎకరం భూమిని కేటాయించాలని దళిత సంఘం నాయకులు శనివారం ఆర్డీవో కోమల్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఇక్కడ దళిత సంఘం నాయకులు విఠల్ కాంబ్లే, భోజన్న, లక్ష్మణ్, దేవన్న ఉన్నారు.

గ్రామాభివృద్ధి కమిటీపై చర్యలు తీసుకోవాలి

ముథోల్, అక్టోబర్ 19 : బోరిగాం గ్రామాభివృద్ధి కమిటీపై చర్యలు తీసుకోవాలని శనివారం గ్రామస్తులు విఠల్ కాంబ్లే, లక్ష్మణ్, సాయన్న, పోశన్న ఏఎస్పీ అవినాశ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా కమిటీ డబ్బులు ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. కమిటీ రద్దు చేసి అందులో ఉన్న రూ.9 లక్షల 25 వేలను స్వాధీనం చేసుకోవాలని కోరారు. దీంతో పాటు తెల్ల కల్లు బట్టి, బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో దళిత సంఘాల నాయకులు ఉన్నారు.

గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తికి సంవత్సరం జైలు

ఇచ్చోడ, అక్టోబర్ 19 : జల్దా గ్రామానికి చెందిన జాదవ్ భీంలాల్ గుడుంబా విక్రయిస్తూ పలుమార్లు పట్టుబడ్డాడు. తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయడం జరిగింది. రూ.లక్ష జరిమానా విధించినప్పటికీ సకాలంలో చెల్లించకపోవడంతో శనివారం జాదవ్ భీం లాల్‌ను అదుపులోకి తీసుకొని సంవత్సరం రిమాండ్‌కు జిల్లా జైలుకు తరలించినట్లు ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది బాపురావ్, మౌనిక, సంధ్య పాల్గొన్నారు.

క్రీడాకారులకు సమాచారం ఇవ్వాలి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 19 : నిర్మల్ జిల్లాలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పలు క్రీడలకు జిల్లాలోని క్రీడాకారులకు సమాచారం ఇచ్చిన తర్వాతనే క్రీడలు నిర్వహించాలని తైక్వాండో క్రీడాకారుడు అక్షయ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13వ తేదీన స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ఎవరికీ సమాచారం ఇవ్వకుండా పోటీలు నిర్వహించారని దీంతో అనేక మంది క్రీడాకారులు క్రీడా ఎంపిక పోటీల్లో పాల్గొనక పోటీలకు దూరమయ్యారని అన్నారు. దీనిని నిరసిస్తూ స్కూల్ గేమ్ ఫెడరేషన్‌పైన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. సమావేశంలో సోమేశ్ పాల్గొన్నారు.

ఆశ రిజిస్టర్లు ప్రారంభించిన డీఎంహెచ్‌వో

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 19 : ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఆశ కార్యకర్తల వివరాలు నమోదు చేసేందుకు రిజిస్టర్లను అందించగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో రాజేందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్‌వో సాయమ్మ, కార్యక్రమ అధికారి రవీందర్‌రెడ్డి, డీవోఎంహెచ్ఎస్ సౌమ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హీరాపూర్‌లో నేడు కుమ్రం భీం విగ్రహావిష్కరణ

ఇంద్రవెల్లి, అక్టోబర్ 19 : హీరాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కుమ్రం భీం విగ్రహావిష్కరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శనివారం గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనులు కుమ్రం భీం విగ్రహ ఏర్పాటు పనులు వేగంగా పూర్తి చేపట్టారు. ఆదివారం కుమ్రం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కుమ్రం భీం మనుమడు కుమ్రం సోనేరావ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జుపటేల్, కోవ లక్ష్మి, ఎంపీ నగేశ్, మాజీ ఎంపీ సోయం బాపురావ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌష్ ఆలం, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, జిల్లాలోని ఆదివాసీ గిరిజన ప్రజాప్రతినిధులు వస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం, అక్టోబర్ 19 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగులైన యువకులకు కేంద్ర ప్రభుత్వ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకంలో భాగంగా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ వారి ఆధ్వర్యంలో (న్యాక్) ల్యాండ్ సర్వే, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ నగేంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 35 సంవత్సరాలు కలిగి ఉండాలని, శిక్షణ కోసం విద్యార్హత సర్టిఫికెట్, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో న్యాక్ కార్యాలయంలో ఈ నెల 24వ తేదీలోగా అందజేయాలని సూచించారు. వివరాలకు 9154548063 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ

ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 19: ఖానాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం జిల్లా మాధ్యమిక విద్యాధికారి పరశురాం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలన్నారు. ముఖ్యమైన సబ్జెక్ట్ విషయాలను రివిజన్ చేసి ఉత్తీర్ణత శాతం పెంచాలని అన్నారు. విద్యార్థులకు 75 శాతం హాజరు ఉండాలని తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ అబ్దుల్ హమీద్, అధ్యాపకులు ఉన్నారు.

బతుకమ్మ సంబురాలు

బతుకమ్మ ఆడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న సతీమణి రమాదేవి, మహిళలు

ఇచ్చోడ(సిరికొండ)/భీంపూర్, అక్టోబర్ 19 : సిరికొండలోని కొత్తవాడ, రెండోవాడ, హనుమాన్ నగర్ కాలనీల్లో, భీంపూర్ మండలం కరంజి(టీ), గుబిడి, అంతర్గాం , వడూర్, పిప్పల్‌కోటి గ్రామాల్లో శనివారం రాత్రి బతుకమ్మ సంబురాలు వైభవంగా నిర్వహించారు. ముందుగా బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేసి మహిళలు, యువతులు ఆడిపాడారు. డప్పుచప్పుళ్ల నడుమ బతుకమ్మలతో మహిళలు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గ్రామాల్లోని చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు.

బతుకమ్మ వేడుకల్లో మాజీ మంత్రి సతీమణి రమాదేవి

ఎదులాపురం, అక్టోబర్ 19: బతుకమ్మ సంబురాల్లో పాల్గొంటున్న మహిళలకు మాజీ మంత్రి జోగు రామన్న శుభాకాంక్షలు తెలిపారు. శాంతినగర్‌లోని తన నివాసం నుంచి మాజీ మంత్రి జోగు రామన్న సతీమణి రమాదేవితో కలిసి బతుకమ్మను సాగనంపారు. బతుకమ్మను ఎత్తుకొని ఉత్సవాల్లో పాల్గొన్నారు.